# లక్ష్మి

-బి.కృష్ణవేణి

లక్ష్మికి పెళ్ళయ్యింది. ఆ పిల్లకి పెళ్ళవుతుందా, అసలు ఆ పిల్ల తల్లిదండ్రులు ఆమెకి పెళ్ళి చేయగలుగుతారా, లేదా- అని సందేహించిన వారంతా ఆమెకి పెళ్ళయినాక ఆమె భర్తని చూసి తెగ వింత పడ్డారు. ఆమె అదృష్టానికి ఈర్ష్య చెందారు. లక్ష్మి భర్త ఎర్రగా, బుర్రగా, అందంగా వున్నాడు. మంచి పర్సనాలిటీ. నల్ల పిల్లకి ఈ ఎర్ర మొగుడు, ఇంత బాగా వున్న కుర్రాడు ఎట్లా దొరికాడో... ఐనా ఆ అబ్బాయికి ఈ పిల్ల ఎట్లా, ఎందుకు నచ్చిందో... అని ఆరాలు తీశారు కొత్తలో.

అతని పేరు రాజ్‌కుమార్. లక్ష్మితో పెళ్ళయ్యే దాకా తనకి పెళ్ళి వద్దని ఇంట్లో గోలపెట్టాడు. లక్ష్మికంటే తెల్లగా, అందంగా వున్న అమ్మాయిల్ని బలవంతంగా పెళ్ళిచూపుల్లో చూపించారు. ఎవరూ అతనికి నచ్చలేదు. అట్లాంటిది లక్ష్మి నచ్చింది- నల్లగా వున్నప్పటికీ! అంతదాకా పెళ్ళి వొద్దు వొద్దు అన్నవాడు, చేసుకుంటానని తలాడించాడు. లక్ష్మి నల్లగా వుంటే మాత్రమేం... ఆ ముఖంలో ఎంత కళ! ఆమెది ఎట్లాంటి స్ట్రక్చర్! ఆమె హృదయంలోని స్వచ్ఛత, మంచితనం ఆ ముఖంలో ఎట్లా కన్పిస్తుంటాయో, చూస్తే.


పొంగిపోయింది లక్ష్మి. ఆనందంతో నాట్య చేసింది ఆమె హృదయం. తనకి తాను ఎన్ని కబుర్లు- తియ్యనివి చెప్పుకుందో! అదృష్టమంటే తనదే. ఎంత భాగ్యం చేసుకుంటే అట్లాంటి భర్త తనకి దొరుకుతాడు. తను ఆరాధించే దేవుడికి ఎంతగా మొక్కిందో. పెళ్ళిపీటల మీద అతడి పక్కన కూర్చుంటే పులకరించిపోయింది ఒళ్ళంతా. ఇంక తను దేనికీ దిగులుపడాల్సిన పనిలేదు. జీవితంలో ఇక నుంచీ అంతా సౌఖ్యమే. అమ్మా నాన్నలు తనని చూసి బాధపడాల్సిందేమీ వుండదిక. ఇంతదాకా తన గురించి ఎన్ని తిప్పలు పడ్డారో- పెళ్ళి చెయ్యడం కోసమని. వాళ్ళకెంత ఆనందం కల్గిందో.

❀❀❀

పెళ్ళయిన రాత్రికే కార్యం ఏర్పాటు చేశారు. పెళ్ళికొడుకు వైపు వారే పెళ్ళి చేయడం చేత రాత్రికి 'తరలింపు' కార్యక్రమం జరిగింది. లక్ష్మినీ, రాజ్‌కుమార్‌నీ కారులో వూరంతా తిప్పారు- బ్యాండు మేళంతో. తెగ సిగ్గు వేసింది లక్ష్మికి. 'కార్యం జరుగుతున్నట్లు వూళ్ళో అందరికీ తెలియాలా? ఇట్లా ఆచారం ఎందుకు పెట్టారు పెద్దలు?' అనుకున్నది.

కారు నెమ్మదిగా పోతుంటే రోడ్డు పక్క నుంచి అందరూ కార్లో వున్న వాళ్ళని చూసేవాళ్ళే. పైగా కార్లో తమ ముఖాలు అందరికీ అవుపించేలా లైటు ఒకటి. లక్ష్మి తలదించుకుని వుండిపోయింది. ఉలిక్కిపడి చూసింది- తొడ మీద చేయిపడేసరికి. రాజ్‌కుమార్ ఆమె వంక చూసి నవ్వుతూ చేతితో నొక్కాడు, ఆమె తొడమీద. లక్ష్మికి నరాలు జివ్వుమనలేదు. రక్తం వేడెక్కలేదు. ముఖంలో ఆవిర్లు రాలేదు. 'నలుగుర్లో ఇట్లా చేస్తున్నాడేమిటి? ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? ఇతనికి సిగ్గనేది లేదా?' అని ప్రశ్నించుకుంది.

ఆమె హాయిగా వూపిరి పీల్చుకుంది- అతడు తొడమీంచి చేయి తీసిన తర్వాతనే. కార్యం గదిలోకి వెళ్ళాక మగాడు ఏం చేస్తాడో అమ్మలక్కలు ముందుగానే చెప్పి వుండటం చేత గదిలోకి వెళ్ళేప్పుడు మాత్రం గుండె దడదడా కొట్టుకుంది లక్ష్మికి. రాజ్‌కుమార్ ఆమెని దగ్గరకు తీసుకుని ఆమె పెదాల్ని గట్టిగా ముద్దు పెట్టుకుంటుంటే ఆమెకి పరవశత్వం కల్గి తనూ అతణ్ణి కావలించు కుంది. ఆమె ఇంకా ఆ తియ్యదనాన్ని అనుభ




విస్తుండగానే చప్పున ఆమెని తోసేసి పక్కన కూర్చోమన్నాడు. ఆమెకి అర్థంకాక అతడి ముఖం వంక అట్లాగే చూస్తుంటే... "విన్పించలేదా... చెవుడా" అన్నాడు కఠిన స్వరంతో.

ముఖంలో ఆనందమంతా ఆవిరి అవుతుంటే... ఆమె కూర్చుని, తల ఎటో తిప్పింది.

"ఇటు చూడు."

ఆమె చూసింది.

"నిన్నే ఎందుకు చేసుకున్నానో తెల్సా?"

తల అడ్డంగా వూపింది.

"మాటలు రావా?" గట్టిగా అరిచినట్లే అన్నాడు.

"ఎందుకు చెప్పండి" అంది బెరుకుగా- చిన్న గొంతుతోటి.

"నువ్వు నల్లగా వున్నావు కాబట్టి."

అదిరిపాటుగా చూసింది. ఇట్లా మాట్లాడు తున్నాడేమిటసలు? అతడి ప్రవర్తనలో, మాటల్లో మృదుత్వం ఏమాత్రం లేదు. ఇంత మోటు మనిషా?

"ఆశ్చర్యంగా వుందా. వుండే వుంటుంది. అవునా?"

ఏమి చెప్పాలో లక్ష్మికి తోచలేదు.

ఆమె చేయి లాగి తన చేయి పక్కన వుంచి "చూడు. ఇద్దరికీ ఎంత తేడా వుందో" అన్నాడు వెక్కిరింపుగా. లక్ష్మికి చాలా కష్టంగా తోచింది. తన రంగుని వేలెత్తి చూపుతూ ఎగతాళి చేస్తున్నాడు... తన భర్త! మొదటి రాత్రే!

"ఐనా ఎందుకు చేసుకున్నా ననుకున్నావ్? నా పక్కన నిన్ను చూస్తే 'కాకి ముక్కుకి దొండ పండులా వున్నాడు' అంటారు. నువ్వు కాకివయితే నేను దొండపండునన్న మాట. నా పెళ్ళాం నాకంటే అందంగా వుండకూడదన్నది నా పాలసీ. పైగా అందగత్తెని చేసుకుంటే అందరి చూపులూ దానిమీదే వుంటాయి. అదే నువ్వనుకో... ఏ మగాడూ అంత దీక్షగా నీవంక చూస్తాడనుకోను."

ఒక్కో మాటా లక్ష్మి గుండెల్లో ఒక్కో ముల్లుని గుచ్చింది. ఆమె కలల ప్రపంచం ఒక్కసారిగా తలకిందులయ్యింది. అగాధంలోకో... ఎవరూ కాపాడలేని అరణ్యంలోకో వచ్చినట్లుగా గిలగిలా కొట్టుకున్నది, ఆమె హృదయం. ఎంతగా మురిసింది తన భర్త గొప్ప అందగాడని. ఎట్లా పొంగిపొయ్యింది తనంత భాగ్యవంతురాలు

మరొకరు లేరని. అంతా... ఆ పొంగంతా చప్పున చల్లారింది. అందమైన దేహమున్న వాళ్ళకి అంతే అందమైన హృదయం కూడా వుంటుందని భ్రమించింది ఇంతదాకా. దేహానికీ, హృదయానికీ సంబంధముండదని తెలిసివొచ్చింది. కానీ ఏమిటి వుపయోగం? పెళ్ళి వుచ్చులో చిక్కుకుంది. ఎట్లా బయటపడటం... ఎవరు కాపాడతారు తనని...

రాజ్‌కుమార్‌తో పాటు అత్తవారింట్లో అంతా అట్లాంటి వాళ్ళు గానే కనిపించారు లక్ష్మికి. ఆమె మామయ్యే వాళ్ళలో కాస్త నయం. ఇంటి విషయాల్లో ఎక్కువ జోక్యం కల్పించుకునే వాడు కాదు. ఎక్కువగా బయటి పనుల్లోనే వుండేవాడు.

అత్త, ఆడబిడ్డ- ఎప్పుడూ ఏదో ఓ వంకతో లక్ష్మిని బాధించడమే పనిగా పెట్టుకున్నారు. అందరి బట్టలూ ఆమే వుతకాలి. కొత్త కోడలు అన్న స్పృహ వాళ్ళలో వున్నట్లు లేదు. అన్నేసి బట్టలు ఒక్కసారే వుతకడం అలవాటు లేకపోవడంతో మొదట్లో నడుం పట్టేసినట్లు అయ్యేది. వంటా వార్పూ కూడా లక్ష్మే మొత్తం చేయాల్సి వస్తోంది. లక్ష్మికి ఆ పనుల్లో కొంచెమైనా సాయం చేయాలన్న జ్ఞానం వాళ్ళలో లేదు. స్వర్గం వస్తున్నదనుకుంటూ నరకంలోకి వచ్చిపడింది.

నిజానికి లక్ష్మి అమాయకురాలు కాదు. స్వతహాగా ధైర్యస్తురాలే. తప్పు ఏమీ లేకుండా మాట పడటం ఆమె స్వభావానికి విరుద్ధం. అత్త, ఆడబిడ్డ ఏ కారణం లేకుండానే తనని సూటిపోటి మాటలనడం, విసుక్కోవడం ఆమెని బాధిస్తూ వచ్చాయి. వాళ్ళేదైనా అంటే వెంటనే తాను కూడా ఎదురు సమాధానం చెప్పాలనుకుని కూడా ఆగిపోతూ వచ్చింది. తనలో ఇంత ఓర్పు వుందా... అని ఆశ్చర్యపడింది. కానీ ఓ బానిసలా ఆ ఇంట్లోవాళ్ళు తనని చూస్తుంటే ఎంతకాలమని భరించడం? ఎదురు తిరగమని ఆమె రక్తం ఆమెని పోరు పెడుతుంటే నిభాయించుకోలేకపోయింది.

ఆమె రక్తం వుడికి ఎదురు తిరిగిన ఆరోజు...

"మా యింటికి వెళ్ళి అమ్మా, నాన్నని చూసి వస్తాను" అంది లక్ష్మి భర్తతో ఆఫీసుకని బయలుదేరుతున్నాడతను.

"నాలుగు రోజుల క్రితమే కదా మీ నాన్న వచ్చి ఈ ముద్దుల కూతుర్ని చూసిపొయ్యాడు. అప్పుడే అటు గాలి మళ్ళిందా?" ఈసడిస్తున్నట్లే- అతడి గొంతు.

ఈ మాటలు విన్పించినట్లే ప్రత్యక్షమయ్యింది అత్త.

"నువ్వు యింటికి పోయి కూర్చుంటే ఇక్కడి పనులన్నీ ఎవడు చేస్తాడే... నీ తాతా?"

"విన్నావుగా" అంటూ వెళ్ళిపోయాడు రాజ్‌కుమార్.

అట్లానే నిల్చుండిపొయ్యింది లక్ష్మి. ఇంటికి వెళ్ళేందుకు కూడా తనకి హక్కు లేదా...

"ఏమే... ఇంకా అట్లాగే నిలబడ్డావు కొయ్యమల్లే. పని లేదనుకుంటున్నావా?" అరిచింది అత్త.

"నేను మా యింటికెళ్ళి వస్తాను" ఏదో నిశ్చయించుకున్న దానికిమల్లే అంది.

"ఎంత ధైర్యమే నీకు. అప్పుడే మొగుడన్నా, అత్తన్నా అంత అలుసై పోయారంటే" మీది మీదికొచ్చింది.

"నేను ఈ యింటికి రానప్పుడు పనంతా ఎవరు చేశారు?"

"ఎదురు నన్నే అడుగుతావా. ఎప్పుడూ నోరెత్తి మాట్లాడని దానివి ఇప్పుడిట్లా ఏం చూసుకుని మాట్లాడుతున్నావే. ముందు దొడ్లోకి పద. ఆ గుడ్డలన్నీ ఎవరు వుతుకుతారనుకున్నావ్" అని రెక్క పట్టి లాగబోతుంటే విదిల్చింది. లక్ష్మి అట్లా చేస్తుందని అనుకోకపోవడం చేత ఆ విదిలింపుకి పడబోయి నిలదొక్కుకుంది అత్త.

"వుతకడానికి మీరు లేరా" అని అడిగింది.

పుట్టింటికి అప్పుడే వెళ్ళింది.

లక్ష్మిని చూసి ఏదో జరిగి వుంటుందని వూహించింది తల్లి సావిత్రి. ఆమె ఇంకా అడగక ముందే జరిగింది జరిగినట్లు చెప్పింది లక్ష్మి. కూతురంటే సావిత్రికి ఆపేక్ష ఎక్కువ. ఆమె కూతుర్నేమీ అనలేదు. పెళ్ళయ్యాక అత్తవారిల్లే నీకు సర్వస్వమని ఆమె ఎప్పుడూ కూతురికి చెప్పలేదు. ఇంత దాకా భర్త సంగతి కానీ, అత్తా-ఆడబిడ్డల ఆరళ్ళు గానీ చెడుగా ఎప్పుడూ లక్ష్మి చెప్పలేదు. దాచుకుని, దాచుకుని ఓర్పు చచ్చిపోయాకే



కూతురు యిట్లా బయటపడిందని సావిత్రి అర్థం చేసుకున్నది. లక్ష్మిని అత్త వారింటికి వెళ్ళమని బలవంతం చెయ్యలేదామె.

ఒక రోజు గడిచింది. యింకోసారి వేచి చూద్దాం అన్పించి సావిత్రికి చెప్పి అత్తవారింటికి వెళ్ళింది లక్ష్మి. అత్తా, మామ, ఆడబిడ్డ... వీళ్ళెవరూ ఆమెని పలకరించలేదు. వంటి గదిలోకి వెళ్ళింది. వంట చేసే వుంది. తను లేకపోతే మాత్రం పని మామూలుగానే చేస్తారన్నమాట. తను వుంటే పనంతా తనకే అప్పజెప్తారన్నమాట.

ఆఫీసు నుంచి రావడంతోటే లక్ష్మిని చూసి చప్పున ఆమెని తమ గదిలోకి లాక్కుపోయాడు రాజ్‌కుమార్.

"ఎక్కడికి పోయావే" అని చేయి మెలితిప్పాడు.

బాధ ఓర్చుకుంటూ "మా యింటికి" అంది భయపడకుండా.

"మీ యింటికేనా. ఇంకెవడింటికైనానా.. చెప్పవే లం..."

ఆ మాటల్తో అతడంటే అసహ్యం పుట్టింది. "అంతకంటే మంచిగా ఆలోచించలేరా."

"ఆలోచించనే. ఎందుకు ఆలోచించాలి. మన పెళ్ళికాక ముందు ఎవడో రామకృష్ణ అనేవాడు మీ యింటికి ఎప్పుడూ వస్తూపోతూ వుండేవాడు. వచ్చినప్పుడల్లా గంటలు గంటలు ఒకటే కబుర్లు. నిజమా, అబద్ధమా?" అని జుట్టు పట్టుకుని లాగబోతుంటే గోళ్ళతో ఆ చేతిని పీకింది. "అబ్బా" అంటూ వొదిలి చేయి చూసుకుంటున్నాడు.

"నిజవేఁ. అతను నాతో పాటు చదువుకున్నాడు. మా బంధువులబ్బాయే. అందుకే, ఆ చనువుతోనే వస్తుంటాడు. అందులో తప్పేముంది" ఆమె కంఠంలో స్వచ్ఛత... నిజాయితీ.

"ఎంత తేలిగ్గా చెప్తున్నావే భయం లేకుండా. నాకు తెల్సింది నిజమేనన్నమాట. మా కొలీగ్ ఆ రామకృష్ణ గాడి సంగతి చెప్తుంటే ఏమో అనుకున్నా. నిజమని ఇప్పుడు తేలింది. ఐనా ఓ పరాయి మగాడికి అంతసేపు మాటలు చెప్పాల్సిన పనేమిటే... వాడికీ నీకూ ఏమీ లేకపోతే..." అంటూ ఆమె బుగ్గల్ని చేత్తో వొత్తుతూ "చెప్పు... చెప్పవే" అన్నాడు ముఖం క్రూరంగా పెట్టి.

నొప్పితో అల్లాడిపోయింది లక్ష్మి. శారీరక బాధ కంటే మానసిక బాధే అధికం. అతడన్న మాటలకి హృదయం తూట్లు పడింది. ఆమె కళ్ళ వెంట నీళ్ళు. వూహ తెలిశాక ఆ రకమైన నీళ్ళు కళ్ళ నుండి రావడం అదే తొలిసారి. ఏ అధికారంతో రాజ్‌కుమార్ తనని యిట్లా హింసిస్తున్నాడు? అవకాశమిచ్చింది తనేనా? తాళి కట్టినంత మాత్రం చేత తనమీద సర్వహక్కులూ అతడికి సంక్రమిస్తాయా? తనెందుకు సహించాలి... తిరగబడమని హృదయం... అణచు కుంది ఎట్లానో. యిష్టం వచ్చినట్లు ఆమెని తిట్టి, కొట్టి... అలసిపోయి వెళ్ళిపోయాడు రాజ్‌కుమార్. జీవచ్ఛవంలా ఆ గదిలో లక్ష్మి అట్లాగే... ఎంతసేపో...

❀❀❀

లక్ష్మి అత్త వారింటికి వెళ్ళాక సావిత్రి మనసు

మనసులో లేదు. అక్కడేదో గొడవ జరుగుతుందని నిశ్చయంగా తోచిందామెకి. వూహా వచ్చిందే తడవు అక్కడికి వచ్చింది. వచ్చి చూసింది. ఒళ్ళంతా పచ్చి పుండయి మూటలా పడి వుంది లక్ష్మి. నానా యాతనా పడుతోంది లేవలేక. సావిత్రి తల్లి హృదయం తల్లడిల్లింది. ఆ యిల్లు రాక్షసుల కొంపగా అన్పించింది. ఐనా ఎవరినీ ఏమీ అనలేదామె. లక్ష్మిని తమ యింటికి తెచ్చేసుకుంది. ఎవరూ అడ్డు చెప్పలేదు. ఏమీ మాట్లాడలేదు.

లక్ష్మికి జ్వరం వచ్చింది. నాలుగు రోజులకి జ్వరం, వొంటి నొప్పులూ తగ్గాయి. ఆమె పుట్టింటికి వొచ్చిన మూడోరోజు రాజ్‌కుమార్ అక్కడికి వొచ్చాడు. తల్లీ కూతుళ్ళప్పుడు భోజనాలు చేస్తున్నారు. ముందు సావిత్రే చూసింది అతణ్ణి. "మీ ఆయనొచ్చాడు" అంటూ మర్యాదగానే అతణ్ణి లోనికి పిల్చింది. అతడు వచ్చి కూర్చున్నాక భోజనం కానిచ్చి వచ్చారిద్దరూ. "నేను లక్ష్మితో మాట్లాడాలి" అన్నాడు వాళ్ళ వంక చూడకుండా.

సావిత్రి లోపలకి పోతుంటే ఆపబోయింది లక్ష్మి. కళ్ళతోనే ధైర్యం చెప్పి తను దొడ్లోకి వెళ్ళింది సావిత్రి.

"ఏమిటి నీ వుద్దేశం. చెప్పా పెట్టకుండా మీ అమ్మ తీసుకువస్తుంటే వచ్చేయడమేనా. అక్కడ మా పరువు సంగతి ఏమన్నా ఆలోచించావా." అతడికి తన పరువు సంగతే తప్ప తన గురించిన ఆలోచన లేనందుకు బాధపడలేదు లక్ష్మి. ఆశ్చర్యపోనూ లేదు. అతడికి జవాబు చెప్పాలనీ అన్పించలేదు.

ఆమె మౌనాన్ని ఇంకోలా అర్థం చేసుకున్నాడతడు. "అయ్యిందేదో అయ్యింది. మనింటికి వెళ్దాం పద" అన్నాడు లేస్తూ.

అప్పుడూ లక్ష్మి నుంచి మౌనమే సమాధానం. "వస్తున్నట్లా, రానట్లా" చిరాకుపడ్తూ అడిగాడు.

"ఎందుకు రావాలి? నువ్వు కొట్టే దెబ్బలు భరించడానికీ, మీ అమ్మా, చెల్లెలూ బానిసలా చూస్తుంటే సహించడానికీ రావాలా? మొన్న నువ్వు మృగంలా నన్ను పెట్టిన హింసకే నా వొళ్ళు ఎట్లా హూనం అయి వుంటుందో ఆలోచనైనా చెయ్యని వాడివి, నీతో వచ్చి కాపురం చెయ్యాలా నేను?"

"ఏం బాగానే వున్నావు కదా. తిండి కూడా తిన్నావు కదా యిప్పుడే.'

దొడ్లో వున్నప్పటికీ సావిత్రికి ఆ మాటలు విన్పిస్తూనే వున్నాయి. ఆమె వుండబట్టలేక అక్కడికి వొచ్చి "రెండు రోజులు జ్వరంతో తిండిలేక నీరసించిపోతే ఇప్పుడే కాస్త మజ్జిగతో అన్నం పెట్టాను బాబూ. కొంచెం దాని ఆరోగ్యం బాగవనీ. అప్పుడొస్తుందిలే" అంది.

లక్ష్మి వంక నిప్పులు కురిపిస్తున్నట్లు చూస్తూ వెళ్ళాడు రాజ్‌కుమార్.

"నువ్వు చెప్పింది ఆ పశువుకి అర్థమవుతుందా అమ్మా" అంది– తల్లిని కావలించుకుంటూ లక్ష్మి. కూతురి తలని అనునయంగా నిమిరింది సావిత్రి.

వారం రోజులు గడిచాయి. లక్ష్మి పుట్టింటి వద్దనే వుందింకా. రాజ్‌కుమార్ మళ్ళీ రాలేదు. వుత్తరం వొచ్చింది. ఏ భర్తా భార్యకి అట్లాంటి వుత్తరం రాసి వుండడేమో. "నువ్వింకా అక్కడే వున్నావంటే, నా అనుమానమే నిజమని గట్టిగా అన్పిస్తోంది. ఆ రామకృష్ణ గాడు వస్తున్నాడనుకుంటా. ఇంకేం రావాలన్పిస్తుంది నీకు. వాడితో పక్కమీద సుఖం దొరుకుతుంటే నేనెందుకికంక నీకు..." ఇట్లా ఛండాలమైన భాషలో రాశాడు. ఏ మూలో రాజ్‌కుమార్ తన భర్త అని వున్న కొంచెం భావం కూడా మాయమయ్యింది లక్ష్మిలో.

❀❀❀

తనని ఎవరో పేరు పెట్టి పిలుస్తున్నట్లు తోచి వులిక్కిపడుతూ దొడ్లోంచి ముందు గదిలోకి వచ్చింది లక్ష్మి. గుమ్మం వద్ద నిల్చుని వున్నాడు రామకృష్ణ. "నువ్వా కృష్ణా... రారా" అంది కుర్చీ చూపిస్తూ.

"ఇక్కడికి ఎప్పుడొచ్చావు? చాలా సన్నగా, బలహీనంగా కన్పిస్తున్నావే?" అడిగాడు.

"వచ్చి పది రోజులయ్యింది"

"ఏమైనా విశేషమా" నర్మగర్భంగా నవ్వుతూ అడిగాడు.

వుద్దేశం గ్రహించి "అట్లాంటిదేం లేదు" అంది సన్నగా.

ఆమె గొంతులో తను ఆశించిన రియాక్షన్

కన్పించలేదు అతడికి. ఏదో సంగతి వుందని తోచింది. "అమ్మ లేదా యింట్లో... ఎట్లా వుంది మీ దాంపత్యం. ఓకేనే కదా."

అబద్ధం చెప్పాలన్పించ లేదు. "నువ్వు వచ్చినప్పుడు వూ ఆయన... సారీ... ఆ రాజ్‌కుమార్ వుంటే ఎట్లా వుండేదో... ఏం యుద్ధం జరిగేదో."

"అదేమిటి లక్ష్మీ" విస్తుపోయాడు.

అంతా చెప్పింది. నోట మాట రాక కొంచెం సేపు అట్లానే వుండిపోయాడు.

"నీ జీవితం యిట్లా అవుతుందని కొంచెం కూడా వూహించలేదు. మంచి అందగాడు నీ భర్తగా వచ్చాడని తెల్సి ఎంత ఆనందించానో. అప్పుడే యిట్లాంటి బాధాకరమైన విషయం నీ నోటి వెంట వినాల్సి వస్తుందని అనుకోలేదు. నీ జీవితం యిట్లా అవడానికి నేను కారకుణ్ణయి నానా" అతని కంఠం వొణికింది.

"యిందులో నువ్వు చేసిందేముంది కృష్ణా. అతడి హృదయం అట్లాంటిది. నువ్వు కాకపోతే మరొక వంక అతడికి దొరకదా. ఐనా నాకేమీ తోచడం లేదు కృష్ణా యిట్లాగే ఎంతకాలమని కూర్చోను. మళ్ళీ ఆ నరకంలోకి వెళ్ళలేను. చుట్టుపక్కల వాళ్ళ మాటలు వింటుంటే జీవితం మీదే ఆసక్తి నశిస్తోంది." లక్ష్మి గొంతులో నిరాశ... నిరాసక్తత.

"అతను తన దగ్గరికి రమ్మని మళ్ళీ వొస్తే?"

"వెళ్ళను. అతనితో కాపురం చేయడం ఇంక వొట్టి మాట."

"మనసు మారదు కదా... ఐనా మీ ఆడాళ్ళు వూరికే కరిగిపోతుంటారు."

"మారదు... అతడి విషయంలో ఇంక మారనే మారదు."

"ఐతే విడాకులియ్యి. నీ బతుకేదో నువ్వు బతుకు. ఇవాళ ఆడాళ్ళు ఎన్ని పనులు చేయడం లేదు. నువ్వు చదువుకున్న దానివేగా. కంప్యూటర్ నాలెడ్జి కూడా వుందాయె. ఎక్కడన్నా వుద్యోగం దొరక్కపోదు. నేను కూడా ప్రయత్నిస్తాను."

అప్పుడే వచ్చింది సావిత్రి. "విడాకులిమ్మంటున్నావా కృష్ణా. మరీ అంతదాకా తీసుకుపోవడం మంచిదా. ఒక్కతే ఈ లోకంలో ఎట్లా బతుకుతుందయ్యా. మేం ఎంతకాలం వుంటామో... మా తర్వాత దాని పరిస్థితి ఏంటి..."

"కృష్ణ సరిగానే చెప్పాడమ్మా. నేనెవరికీ భారం కావడం నాకిష్టం లేదు. ఆ నీచుడితో కలిసి వుండటమనేది జరగదు. నా కాళ్ళమీద నేను నిలబడతాను. 'మగాడు. తోడుంటేనే ఆడదానికి సార్థకత' అని నేననుకోవడం లేదు. నా జీవితాన్ని నా చేతుల్లోనే వుంచుకుంటాను. నా యిష్టం వచ్చినట్లు దాన్ని మలచుకుంటాను" దృఢంగా చెప్పింది లక్ష్మి.

అభినందనపూర్వకంగా ఆమె వంక చూసి నవ్వాడు రామకృష్ణ.



ఇల్లస్ట్రేటర్ అక్బర్ దగ్గరకి ఓ కవిగారు వచ్చి తన కవితల కట్ట చూపించి – "ఈ కవితలన్నీ చదివి నా పుస్తకానికి టైటిల్ గీసి పెట్టాలి ఎంతవుతుంది?" అని అడిగారు.

మొత్తం వెయ్యి రూపాయలు అవుతుందని అక్బర్ ఖచ్చితంగా చెప్పేశాడు.

"ఎలా?" ఆశ్చర్యంగా అడిగారు కవి.

"టైటిల్ బొమ్మకు మూడు వందలు! మీ కవితలన్నీ చదివినందుకు ఏడు వందలు!"

–శ్యాంమోహన్